బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా మహేష్

కేశంపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా కేశంపేట మండలం పోమాల్‌పల్లికి చెందిన కుమ్మరి మహేష్‌ను జిల్లా నాయకత్వం గురువారం నియమించింది. 2017 నుంచి క్రియాశీల సభ్యుడిగా పనిచేసిన మహేష్, ఓబీసీ మోర్చా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్న విషయాన్ని గమనించిన జిల్లా నాయకత్వం మహేష్‌కు జిల్లా కార్యవర్గంలో స్థానం కల్పించింది. తనకు పదవి ఇవ్వడానికి కృషి చేసిన ఎంపీ డీకే అరుణ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, బాబయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.


లక్ష్మీదేవిపల్లి గ్రామం

సీఎం వరాలు కురిపించేనా?

నేడు షాద్‌నగర్ నియోజకవర్గంలో రేవంత్ పర్యటన

మొగిలిగిద్ద పాఠశాల 150వ వార్షికోత్సవానికి రాక

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై కోటి ఆశలు!

అభివృద్ధి పనులపై ప్రకటన కోసం ఎదురుచూపులు

పెండింగ్ నిధులు విడుదల చేయాలంటున్న ప్రజలు



షాద్‌నగర్/షాద్‌నగర్ అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్‌రెడ్డి షాద్‌నగర్ నియోజకవర్గంలో రెండోసారి పర్యటించనున్నారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల 150వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొననున్నారు. సీఎం రేవంత్ రాక నేపథ్యంలో షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధిపై ఎలాంటి వరాలు కురిపిస్తారా? అని ఈ ప్రాంత ప్రజలు గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై స్పందించాలని కోరుకుంటున్నారు. అంతకుముందు ఎన్నికల ప్రచారంలో మాజీ సీఎం కేసీఆర్ కుర్చీ వేసుకొని మరీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక దాని గురించి పట్టించుకోలేదు. ఈ విషయంపై ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అప్పట్లో

మిగతా 6వ పేజీలో...

సీఎం సభకు పకడ్బందీగా ఏర్పాట్లు

సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మొగిలిగిద్ద రానున్న నేపథ్యంలో కలెక్టర్ నారాయణరెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. సీఎం సభ జరిగే ప్రాంతాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి పరిశీలించారు. మొగిలిగిద్ద పాఠశాలకు చేరుకుని నూతన భవన నిర్మాణం గురించి ఇంజనీర్, కాంట్రాక్టర్లతో చర్చించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ సీఎం సభకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. పాఠశాలను అందంగా అలంకరించి రెడ్ కార్పెట్ పరచాలని సూచించారు.


మొగిలిగిద్ద పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రేపు కేంద్రం ప్రవేశపెట్టనున్న రైల్వే బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న హైదరాబాద్ (కొల్లూరు) - ముంబై, శంషాబాద్ - వైజాగ్ హైస్పీడ్ రైల్ కారిడార్లతో పాటు ఎయిర్‌పోర్టు, ఫ్యూచర్ సిటీ వరకు తలపెట్టిన మెట్రో విస్తరణ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కృష్ణా రైల్వే ప్రాజెక్టులు ముందుకు కదలాలంటే కేంద్రం కనికరించాలి. రేపటి బడ్జెట్‌లో ఈ రైల్వేప్రాజెక్టు పనులు ముందుకు సాగేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తుందా? లేక గతంలో మాదిరిగానే ఎదురు చూపులకే పరిమితం చేయనుందా? అనే విషయం చర్చనీయాంశంగా మారింది.





మెట్రో, హైస్పీడ్ రైళ్లపై

గంపెడాశలు!

రేపు ప్రవేశపెట్టనున్న రైల్వే బడ్జెట్.. ఈసారైనా కేంద్రం కరుణించేనా?

'హైదరాబాద్ - ముంబై' కారిడార్‌కు ఆమోదముద్ర పడేనా?

'శంషాబాద్-వైజాగ్' కారిడార్ పనులపై ఆశలు

మెట్రో విస్తరణకు నిధులు ఇచ్చేనా?

'కృష్ణా రైల్వేలైన్' కదలికపై ఎదురుచూపులు

నిధుల కేటాయింపు జరిగితేనే పనులు ముందుకు



రంగారెడ్డి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హైదరాబాద్ శివారులోని కొల్లూరు నుంచి ముంబై వరకు శరవేగంగా రాకపోకలు సాగించేందుకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సీఎల్) ప్రతిపాదించిన హైదరాబాద్ - ముంబై హైస్పీడ్ రైల్ కారిడార్‌కు సంబంధించి పర్యావరణ, సామాజిక అనుమతులు పొందడానికి మూడేళ్ల కిందటనే ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసిన సంగతి తెలిసిందే. హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ, అలైన్‌మెంట్ పనులు చేపట్టాల్సిన సమయంలో ఆ ప్రక్రియ అర్ధంతరంగా నిలిచిపోయింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో లక్ష కోట్ల వ్యయంతో ఈ మార్గంలో హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల కిందట ప్రతిపాదించింది. హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ తయారీ బాధ్యతలను రైల్వే మంత్రిత్వ శాఖ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అప్పగించిన విషయం తెలిసిందే.



మూడున్నర గంటల్లోనే ముంబైకి..

హైదరాబాద్ - ముంబై హైస్పీడ్ రైల్ కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపితే 649.76 కిలోమీటర్ల దూరాన్ని కేవలం మూడున్నర గంటల్లోనే చేరుకునే విధంగా

మిగతా 4వ పేజీలో...

ఎయిర్‌పోర్టు, ఫ్యూచర్ సిటీ మెట్రోకు..

నగరం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు కొత్తగా నిర్మించనున్న ఫ్యూచర్ సిటీ వరకు రెండో ఫేజ్‌లో మెట్రో రైల్వే లైన్ విస్తరణ చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అలాగే ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు విస్తరించనున్నారు. ఇదిలా ఉంటే స్థానికుల డిమాండ్ మేరకు ఫేజ్-3 కింద మేడ్చల్, శామీర్‌పేటకు సైతం మెట్రో విస్తరణ చేపడుతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే నిధుల కొరత ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు చేయూతనివ్వాలని కేంద్రాన్ని కోరింది. దీనిపై ఇప్పటివరకు కేంద్రం నుంచి స్పందన రాలేదు. వాస్తవానికి మెట్రో రైలును ఎయిర్‌పోర్టు వరకు పొడిగించేందుకు చేపట్టిన నిర్మాణ పనులకు గత బీఆర్ఎస్ హయాంలో రూ.500 కోట్లు కేటాయించారు. రాయదుర్గం నుంచి శంషాబాద్‌కు 31 కి.మీ మేర సాగే ఈ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులు రూ.6,250 కోట్లు సమకూరుస్తున్నట్లు అప్పట్లో ప్రకటించింది. అయితే ప్రభుత్వం మారడంతో ఈ ప్రాజెక్టులో మార్పులు చేశారు. అలాగే కొత్తగా నిర్మిస్తున్న రీజినల్ రింగురోడ్డుకు అనుబంధంగా రింగు రైల్వేలైన్ నిర్మిస్తామని గతంలో కేంద్రం ప్రకటించింది. దీనికి రూ.12,408 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా. కేంద్రం సహకరిస్తే ఈ ప్రాజెక్టులన్నీ వేగవంతంగా పూర్తయ్యే అవకాశాలు ఉంటాయి.

పెళ్లికి బాజా మోగింది!



నేటి నుంచి శుభముహూర్తాలు

జిల్లాలో మొదలైన పెళ్లి సందడి

ఒక్కటి కానున్న వేలాది జంటలు

డెకరేషన్, క్యాటరింగ్, వాయిద్య బృందం, ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఫుల్ డిమాండ్

కిటకిటలాడుతున్న వస్త్ర, బంగారు దుకాణాలు

రంగారెడ్డి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : శుభ గడియలు మొదలయ్యాయి. జిల్లాకు పెళ్లి కళ వచ్చేసింది. ఉపనయనాలు (ఒడుగు), గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, వివాహ క్రతువుల సన్నాయి మేళాల సవ్వడి జోరందుకోనుంది. నేటి (శుక్రవారం) నుంచి శుభముహూర్తాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నాలుగు నెలల పాటు పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయని పురోహితులు చెబుతున్నారు. ఇప్పటికే పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్న వారు నిశ్చయ తాంబులాలు మార్చుకుని వివాహానికి సిద్ధమవుతున్నారు. ఫంక్షన్‌హాళ్లు, బ్యాంకెట్ హాళ్లు బుకింగ్ చేసుకున్నారు. పెళ్లి సామగ్రి, బట్టలు, బంగారం కొనుగోలు దారులతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. పెళ్లి మండపాలు ముస్తాబవుతున్నాయి. శుభలేఖలు ప్రింటింగ్ అవుతున్నాయి. వంటవారు, బాజాభజంత్రీల వారు, పురోహితులు ఇక యమా బిజీ కానున్నారు. పెళ్లిళ్ల సీజన్‌తో ఎన్నో కుటుంబాల్లో

మిగతా 4వ పేజీలో...



శుభ ముహూర్తాలివే...

జనవరి 31

ఫిబ్రవరి 2, 6, 7, 8, 12, 13, 14, 15, 16, 20, 22, 23

మార్చి 1, 2, 6, 7, 12, 14, 15, 16

ఏప్రిల్ 9, 10, 11, 12, 13, 16, 18, 20, 23, (29, 30 వైశాఖం)

మే నెలలో 1, 7, 8, 9, 10, 11, 14, 15, 16, 17, 18, 21, 22, 23, (28 జ్యేష్ఠ మాసం)

ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

ఫేక్ కాల్‌గా నిర్ధారణ

శంషాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరోసారి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. ఈ విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా, రాజంపేట్ మండలం, కవ్వపల్లి గ్రామానికి చెందిన నితిన్ (30) బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు 100కు కాల్ చేసి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బాంబు పెట్టామని బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు విమానాశ్రయంలో బాంబు, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి బాంబు లేదని నిర్ధారించిన పోలీసులు.. ఇది ఫేక్ కాల్‌గా తేల్చి చెప్పారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ఆ కాల్ చేసింది కామారెడ్డి జిల్లా చెందిన నితిన్‌గా గుర్తించారు. ఇతనికి కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా లేదని పోలీసులు విచారణలో తేల్చారు. నిందితుడి భార్య పుట్టింటికి వెళ్లిందని విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడని కుటుంబ సభ్యులు వివరించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. త్వరలోనే నిందితుడిని అరెస్టు చేస్తామని హెచ్చరించారు.

చేవెళ్లలో ఎంపీటీసీ స్థానాల కుదింపు

17 నుంచి 12కు చేరిన సంఖ్య

చేవెళ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మున్సిపాలిటీగా ఏర్పాటు కావడంతో చేవెళ్ల మండలంలో ఉన్న ఎంపీటీసీ స్థానాల సంఖ్య 17 నుంచి 12 కు చేరుకుంది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం డ్రాఫ్ట్ విడుదల చేసిందని ఎంపీడీవో హిమబిందు తెలిపారు. చేవెళ్ల మండలంలో మున్సిపల్ పరిధిలో ఉన్న 5 ఎంపీటీసీ స్థానాలను తొలగించామన్నారు. దీంతో 12 ఎంపీటీసీ స్థానాలు మిగిలాయని తెలిపారు. ఎంపీటీసీ పరిధిలోకి వచ్చే గ్రామాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిబ్రవరి 2వ తేదీ వరకు తెలియజేయాలని సూచించారు. 3వ తేదీన తుది జాబితాను ప్రకటిస్తామని ఎంపీడీవో స్పష్టం చేశారు.

కొత్తూర్ మున్సిపాలిటీ నుంచి

కొత్తూర్ : నూతనంగా ఏర్పడిన కొత్తూర్ మున్సిపాలిటీలోని ఐదు ఎంపీటీసీ స్థానాలను తొలగిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో అరుంధతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే మండలంలోని తీగాపూర్‌ను నూతన ఎంపీటీసీ స్థానంగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో మొత్తం ఆరు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని తెలిపారు. గూడూరు ఎంపీటీసీ స్థానం పరిధిలో గూడూరు, మక్తగూడ, మల్లాపూర్, మల్లాపూర్‌తండా గ్రామపంచాయతీలు, తీగాపూర్ ఎంపీటీసీ పరిధిలో తీగాపూర్ గ్రామపంచాయతీ, పెంజర్ల ఎంపీటీసీ పరిధిలో పెంజర్ల గ్రామపంచాయతీ, కొడిచర్ల ఎంపీటీసీ పరిధిలో కొడిచర్ల, కొడిచర్లతండా గ్రామపంచాయతీ, ఎస్‌బీ పల్లి గ్రామపంచాయతీలు, ఇన్ముల్‌నర్వ ఎంపీటీసీ పరిధిలో ఇన్ముల్‌నర్వ గ్రామపంచాయతీ, సిద్దాపూర్ ఎంపీటీసీ పరిధిలో సిద్దాపూర్, మైఎంతండా గ్రామపంచాయతీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 31న ఎంపీడీవో కార్యాలయంలో తెలియజేయాలన్నారు. వాటిని ఫిబ్రవరి 1నుంచి 2వరకు పరిశీలన చేసి, 3వ తేదీన తుది జాబితా విడుదల చేస్తామని ఎంపీడీవో తెలిపారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఈజీఎస్ ఉద్యోగులు

జీతాలివ్వాలని ఆందోళన

రంగారెడ్డి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని జిల్లా ఉపాధి హామీ పథకం జేఏసీ ఛైర్మన్ కందుకూరి నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాగభూషణం మాట్లాడుతూ పంచాయతీరాజ్ సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క ఉపాధిహామీ ఉద్యోగులకు పేస్కేల్ ఇస్తున్నామని స్వయంగా ప్రకటించినప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. మూడు నెలల నుంచి జీతాల్లేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు వచ్చేలా చూడాలని కోరారు.

సిద్ధమవుతున్న క్రెడిట్ ప్లాన్

కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రెడిట్ ప్లాన్‌ను లీడ్ బ్యాంకు సిద్ధం చేస్తుందని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి నాబార్డు పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ కరదీపికను ఆయన గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. పంట ఉత్పత్తి నిర్వహణ, మార్కెటింగ్ కోసం రూ.4633.4 కోట్లు, వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల కోసం టర్మ్‌లోన్ రూ.2107.22 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయల కోసం రూ.803.19 కోట్లు, అనుబంధ కార్యకలాపాల కోసం రూ.2,464.30 కోట్లు, సూక్ష్మ, చిన్నతరహా, మధ్య తరహా సంస్థల కోసం రూ.20,342.65 కోట్లు అంచనా వేయడం జరిగిందన్నారు. జిల్లా మొత్తం ప్రాధాన్యత రంగానికి రూ.32,062.17 కోట్లుగా నాబార్డు అంచనా వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం హర్ష రఘురామ్, డీడీఎం, నాబార్డు అధికారులు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అస్సాం డిప్యూటీ స్పీకర్‌కు బీజేపీ నాయకుల సన్మానం



మోమిన్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అస్సాం డిప్యూటీ స్పీకర్ నూమల్ మోమిన్‌ను చేవెళ్ల మండల బీజేపీ నాయకులు సన్మానించారు. గురువారం చేవెళ్ల పట్టణం మీదుగా కర్ణాటకకు వెళ్తున్న ఆయనకు బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సన్మానించారు. నాయకులు డాక్టర్ మల్లారి వైభవ్‌రెడ్డి, మశ్చేందర్ రెడ్డి, జయసింహారెడ్డి, అభిషేక్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, తినేత్ర తదితరులు ఉన్నారు.

పట్టాదారులందరికీ రైతు భరోసా ఇవ్వండి

యాచారం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టాభూములు కలిగి ఆన్‌లైన్‌లో పేర్లున్న రైతులందరికీ రైతు భరోసా కింద ఆర్థిక సాయమందించాలని, నిషేధిత జాబితాలో లేని రైతులను తక్షణమే ఆదుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డిలను కోరారు. గురువారం ఫార్మాసిటీ బాధిత గ్రామాలైన మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన రైతులు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. 8ఏళ్లుగా తమకు రైతు భరోసా రావడం లేదని. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని రైతులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. నిషేధిత జాబితాలో లేని రైతులకు రైతు భరోసా ఇవ్వడం లేదని, తమ పేర్లను ఆన్‌లైన్‌లో చేర్చాలని ఎమ్మెల్యేను కోరారు. తాము పత్తిని మిల్లులకు తరలించినా ఆన్‌లైన్‌లో మీ పేర్లు లేవని తీసుకోవడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. దాంతో రైతుల సమస్యను ఎమ్మెల్యే కలెక్టర్ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డిలకు ఫోన్ చేసి వివరించారు. సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం రైతులు కలెక్టర్‌ను కలిసి గోడు వెళ్ల బోసుకున్నారు. రైతులను ఆదుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. కుర్మిద్ద, నానక్‌నగర్ గ్రామాల మాజీ సర్పంచ్‌లు బి.రాజశేఖర్‌రెడ్డి, ముత్యాల వెంకట్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అరవింద్‌నాయక్, సుతన్‌రెడ్డి తదితరులున్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

కేశంపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కేశంపేట మండలాధ్యక్షుడు చిర్ర శ్రీను పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం చలో హైదరాబాద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉప కులాల భవిష్యత్ ఆధారపడి ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 7న నగరంలో మహాప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. దశరథం, గ్యార సురేష్, లింగం, సునీల్, యాదయ్య, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

దేనికైనా ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ శీతల్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శీతల్

వికారాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు గురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ శీతల్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో మహిళల హక్కులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని చేసేచోట్ల మహిళలు లైంగిక వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్య మెసేజ్‌లు పోస్ట్ చేయడం, వీడియోలు పంపడం, వీడియోకాల్ చేయడం, స్క్రీన్ షాట్‌లు పోస్ట్ చేయడం వంటివి లైంగిక వేధింపుల పరిధిలోకి వస్తాయన్నారు. అదనపు కలెక్టర్ సుధీర్, కలెక్టరేట్ ఏవో ఫర్హీన్, లీగల్ ఎయిడ్ బార్ కౌన్సిల్ సభ్యులు వెంకటేశం, రాము, శ్రీనివాస్, ప్యానెల్ అడ్వకేట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పెళ్లికి బాజా మోగింది!

(3వ పేజీ తరువాయి)

సంతోషాలు నింపడమే కాకుండా 20 నుంచి 25 రంగాలకు చెందిన వందలాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి పొందే అవకాశం ఉంది.

ముందస్తుగా ఫంక్షన్‌హాళ్ల బుకింగ్

వివాహాలు అధికంగా ఉండటతో ఫంక్షన్‌హాళ్లను ముందస్తుగానే బుక్ చేసుకున్నారు. పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో వాటి ధరలను అమాంతంగా పెంచేశారు. మరో వైపు పురోహితులు, ఈవెంట్ ఆర్గనైజర్లు, క్యాటరింగ్, వస్త్ర వ్యాపారులు, బంగారం, వెండి వ్యాపారాలు, అలంకరణ, రవాణా వాహన యజమానులు, మేళతాళాల వారికి, టెంట్‌హౌస్‌లకు డిమాండ్ పెరిగింది. ఒక్కో వివాహ శుభకార్యంలో సగటున ప్రత్యక్షంగా, పరోక్షంగా వంద మంది వరకు ఉపాధి పొందనున్నారు.

దివ్యమైన ముహూర్తాలు



ఉగాది వరకు దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయి. వివాహ, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు, తదితర శుభకార్యాలకు అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికే ఎన్నో జంటలకు పెళ్లి ముహూర్తాలు ఫిక్స్ చేయడం జరిగింది. పెళ్లిళ్లతో పురోహితులతో పాటు అందరికి చేతి నిండా లభించనుంది.

- పద్మాకరచార్యులు, ఏకదంత మఠ సంస్థాన పురోహితుడు

15 పెళ్లిళ్ల వరకు బుక్ అయ్యాయి



నేటి నుంచి ఉగాది వరకు, ఆ తర్వాత రెండు నెలల వరకు పెళ్లిళ్ల కోసం గార్డెన్ బుక్ చేసుకున్నారు. ఇప్పటి వరకు 15 వివాహాది శుభకార్యాలకు బుక్ చేసుకున్నారు. మా గార్డెన్‌లో పేదల పెళ్లిళ్లకు అవకాశం కల్పిస్తున్నాం. మిగతా వారికంటే కాస్త తక్కువగా ఎమౌంట్ తీసుకుంటున్నాం.

- మోహన్, పద్మావతి గార్డెన్ యజమాని, కనకమామిడి

సీఎం పర్యటనపై రాజకీయ దుమారం వద్దు

షాద్‌నగర్ అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మొగిలిగిద్ద పాఠశాల వార్షికోత్సవానికి హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనపై రాజకీయ దుమారానికి తెరలేపవద్దని టీడీపీ సీనియర్ నాయకుడు మఠం శశిధర్ ప్రకటనలో కోరారు. వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరగానే అంగీకరించిన రేవంత్ రెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డిని మొగిలిగిద్ద గ్రామానికి పంపించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తీసుకున్నారని పేర్కొన్నారు. పాఠశాలతో పాటు గ్రామాభివృద్ధికి వరాలు ప్రకటిస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అనవసర రాద్ధాంతం చేసి విఘాతం కల్గించవద్దని కోరారు.

మెట్రో, హైస్పీడ్ రైళ్లపై గంపెడాశలు!

(3వ పేజీ తరువాయి)

హైస్పీడ్ రైల్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. హైదరాబాద్ - ముంబై మధ్య రోడ్డు మార్గం 710 కి.మీ. దూరం ఉండగా, ఈ దూరం ప్రయాణించేందుకు దాదాపు 13 గంటల సమయం పడుతోంది. ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనైతే 14.20 గంటల వరకు సమయం పడుతోంది. ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ ప్రతిపాదించిన హైస్పీడ్ (బుల్లెట్) రైల్‌లో ప్రయాణిస్తే హైదరాబాద్ నుంచి ముంబై వరకు కేవలం మూడున్నర గంటల్లో చేరుకోవచ్చు. 300 కేఎంపీహెచ్ వేగంతో ప్రయాణించే హైస్పీడ్ రైల్ 650 కి.మీ. దూరాన్ని కేవలం 3 గంటల్లో పూర్తి చేయనుంది. ఈ హైస్పీడ్ రైల్ కారిడార్ మార్గంలో మొత్తం 10 స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

రూట్‌మ్యాప్, లైడార్ సర్వే పూర్తి...

హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించి వికారాబాద్ జిల్లాలో రూట్ మ్యాప్, లైడార్ సర్వే కూడా పూర్తి చేశారు. పర్యావరణ, సామాజిక అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ పూర్తికావడంతో ఇక కారిడార్ ఏర్పాటుకు సంబంధించి క్షేత్రస్థాయిలో అలైన్‌మెంట్ సర్వే పనులపై దృష్టి సారించారు. జిల్లాలో 5 మండలాల పరిధిలోని 39 గ్రామాల మీదుగా 68.5 కిలోమీటర్ల పొడవునా హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రతిపాదించారు. ప్రాజెక్టు కోసం జిల్లాలో తాండూరు, పెద్దేముల్, దారూరు, వికారాబాద్, నవాబుపేట్ మండలాల్లో 124.43 హెక్టార్ల మేర భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. దీంట్లో 112.93 హెక్టార్ల ప్రైవేట్ భూమి ఉండగా, 11.5 హెక్టార్ల ప్రభుత్వ భూమి ఉంది.

శంషాబాద్- విశాఖపట్నం హైస్పీడ్ రైలు

శంషాబాద్ విమానాశ్రయం నుంచి విజయవాడ మీదుగా విశాఖపట్నానికి హైస్పీడ్ రైలు నడిపేందుకు కేంద్రం సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇందులో భాగంగా విమానాశ్రయం నుంచి విజయవాడ వరకు వెళ్లే హైస్పీడ్ రైల్వే ప్రాజెక్టుకు గతేడాది రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కొత్త రైల్వేలైన్ నిర్మాణం కోసం సర్వే ఏడాదిగా జరుగుతోంది. ఈ రైల్వే లైన్‌కు నిధులు కేటాయించి నిర్మాణం పూర్తయితే విజయవాడకు రెండు గంటల్లోనే చేరుకునే అవకాశం ఉంది.

కృష్ణా లైన్ ప్రాజెక్టుకు మోక్షం ఎప్పుడు?

వికారాబాద్ నుంచి కొడంగల్ మీదుగా కృష్ణా వరకు 122 కిలోమీటర్ల రైలు మార్గ నిర్మాణ పనులు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై గతంలో కాంగ్రెస్ నేతలు వత్తిడి చేయడంతో అప్పటి యూపీఏ ప్రభుత్వం 2010 జూన్‌లో సర్వేకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు సర్వే చేసి డీపీఆర్ ఇచ్చారు. అంచనా వ్యయం రూ.2,196 కోట్లుగా పేర్కొన్నారు. 14 ఏళ్లైనా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. దీని నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ నుంచి గోవా వెళ్లేందుకు ప్రయాణ సమయం తగ్గుతుంది. ఇటీవల డీకే అరుణ కేంద్ర మంత్రిని కలిసి ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని కోరారు. అలాగే తాండూరు, మహబూబ్‌నగర్ రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టే వరకూ పోరాటం ఆగదు

చేవెళ్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలని, అప్పటి వరకు పోరాటం ఆగదని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త మల్లారెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన చేపట్టిన రిలే దీక్ష గురువారం మూడవ రోజుకు చేరుకుంది. మల్లారెడ్డికి స్థానికులు, వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలుపుతున్నారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న జాతీయ రహదారి విస్తరణ కోసం కేంద్రం నిధులు మంజూరు చేసి ఏడాది పూర్తవుతున్నా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. దీక్షలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి



మోడల్ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

బొంరాస్‌పేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం నిర్మించి ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్ల కోసం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, అంజిలీరెడ్డి, వెంకట్రాములుగౌడ్, అంబయ్యగౌడ్, మల్లికార్జున్, దేశ్యనాయక్, నర్సింహులునాయుడు పాల్గొన్నారు.

పక్కాగా అభివృద్ధి పనులు

కొడంగల్: కొడంగల్ ప్రాంత అభివృద్ధికి చేపడుతున్న పనులను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ మాడల్ గృహం, అంబేడ్కర్ చౌరస్తా విస్తరణ, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల అదనపు భవన నిర్మాణానికి కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బల్‌రాంనాయక్, ఎంపీడీవో ఉషశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి ఎండీ. యూసుఫ్, పీఏసీఎస్ చైర్మన్లు శివకుమార్‌గుప్త, జయకృష్ణ మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, రాజేందర్ పాల్గొన్నారు.

దుద్యాల ఎంపీపీ కార్యాలయం ప్రారంభం

దుద్యాల: దుద్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ప్రారంభించా రు. పంచాయతీ భవనంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. బొంరాస్‌పేట్ ఎంపీవో మహేశ్‌కుమార్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో వెంకన్‌గౌడ్, తహసీల్దార్ కిషన్‌నాయక్, ఏవోహిమబిందు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

శామీర్‌పేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన, పీఎంజేజేబీవై, పీఎం ఎస్‌బీవై, తదితర పథకాల కింద స్వయం సహాయక మహిళా సంఘాలు వ్యాపార రంగాల్లో ఉపాధి కోసం బ్యాంకుల్లో రుణాలు పొంది ప్రగతిని సాధించాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఏజీఎం) లక్ష్మీశ్రావ్య పిలుపునిచ్చారు. గురువారం శామీర్‌పేట అలియాబాద్ పంచాయతీ భవనంలో ఎల్‌డీఎం శివప్రసాద్ అధ్యక్షతన ఆర్‌బీఐ ఏజీఎం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ) అలియాబాద్ బ్రాంచ్ మేనేజర్ లాల్‌సింగ్ స్వయం సహాయ మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ ఏజీఎం మాట్లాడుతూ సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఎల్‌డీఎం శివప్రసాద్ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, సీసీ, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు, 30 స్వయం సహాయక సంఘాల నుండి 80 మంది మహిళా సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి



మాజీ జేడీ లక్ష్మీనారాయణ

మేడ్చల్ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మేడ్చల్ పట్టణంలో గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన కౌన్సెలింగ్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సబ్జెక్టుపై పట్టు సాధించాలనుకున్న విద్యార్థులు ఏకాగ్రతతో మెలగాలన్నారు. ఎన్ని మార్కులు సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవటానికి పాఠశాలు పునాదులు అన్నారు. చదువుకునే సమయంలో మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

కోట్‌పల్లి, జనవరి30 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో ప్రజలు మోసపోకుండా వారికి అవగాహన కల్పించాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. గురువారం ఆయన కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రఘురాములు, ఎస్ఐ గుఫర్, ఏఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్రీడలపై మక్కువ పెంచుకోవాలి



ప్రశంసా పత్రాలు అందిస్తున్న నర్సింహ, శ్రీరామ్, మల్లారెడ్డి

కందుకూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని మండల విద్యాధికారి హెచ్.నర్సింహ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, క్రికెట్ క్రీడాపోటీల్లో భాగంగా గెలుపొందిన విజేతలకు గురువారం సాయంత్రం ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందడి శ్రీరామ్, కొత్తగూడ మాజీ సర్పంచ్ సాధ మల్లారెడ్డిలు మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేలోత్సవ్-2025 క్రీడాపోటీలు విద్యార్థులకు ఎంతో దోహదపడుతాయని అన్నారు. 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఏబీవీపీ నాయకులు వెంకటేష్, భానుప్రసాద్, జ్యోతిప్రసాద్, అమరేందర్, మౌనికుమార్, అభిరామ్, చందు, జగన్, డిల్లీ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' జాప్యంపై బీఆర్ఎస్ భగ్గు

తలకొండపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం తలకొండపల్లి మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, మాజీ జడ్పీటీసీ వద్య నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆమనగల్లు-షాద్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ కూడలి వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, శేఖర్, నాయకులు యాదయ్య, పాండు యాదవ్ పాల్గొన్నారు.

రిజర్వాయర్ నిర్మించండి

షాద్‌నగర్ అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు డిమాండ్ చేశారు. మొగిలిగిద్ద పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సీఎం రానున్న సందర్భంగా గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. జూరాల నుంచి నీటిని ఎత్తిపోసి చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి శివారులో రిజర్వాయర్‌ను నిర్మించి 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని రూపొందించిన రిజర్వాయర్ పనులు నేటికీ ప్రారంభం కాలేదని గుర్తుచేశారు. తాను కుర్చీవేసుకుని నిర్మిస్తానన్న కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డిజైన్‌ను మార్చి, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌పై పదేళ్ల కాలయాపన చేశాడని ఆరోపించారు. రిజర్వాయర్ కోసం కాంగ్రెస్ చేపట్టిన సభకు ప్రతిపక్ష నేతగా హాజరై రేవంత్‌రెడ్డి, ఎన్నికల ముందు సైతం అధికారంలోకి రాగానే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి, షాద్‌నగర్ ప్రాంతంలోని సాగునీటి సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. చారిత్రాత్మక మొగిలిగిద్ద పాఠశాలకు అన్ని హంగులతో నూతన భవనాన్ని నిర్మించాలని, విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. షాద్‌నగర్ పరిసరాల్లోని కాలుష్యకారక పరిశ్రమలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చెంది మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రాజకీయ విమర్శలను మాని, షాద్‌నగర్ ప్రాంత అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన బీజేపీ మండల కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి, అభినందించారు. అశోక్‌గౌడ్, కృష్ణారెడ్డి, మురళి, వంశీ, స్వాట అశోక్, హరిభూషన్, మఠం రుషికేశ్, నర్సింహ, శ్రీనివాసచారి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



ఎంఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

యాలాల, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజేందర్‌రెడ్డి అన్నారు. యాలాల జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెచ్ఎం, యాలాల ఎంఈవో సుధాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని గురువారం పాఠశాలలో నిర్వహించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ యాలాల మండల శాఖ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు, మాజీ వైస్ ఎంపీపీ అనంతయ్య ముదిరాజ్, కో-ఆప్షన్ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్ బాబా, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్లయ్య పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో గోపాలకృష్ణకు అవార్డు

వికారాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జనవరి 28 నుంచి 30 వరకు జరిగిన 13వ జాతీయ సీనియర్ పూమ్సే, 7వ జాతీయ క్యాడెట్ పూమ్సే తైక్వాండో చాంపియన్ షిప్‌లో వికారాబాద్‌కు చెందిన దుద్యాల గోపాల కృష్ణ అండర్ 50 విభాగంలో మూడో స్థానం సాధించారు. విజయంపై టీఎస్టీఏ అధ్యక్షుడు ముఠా శ్రీనివాస్, కార్యదర్శి కుర్వ శ్రీహరి, వికారాబాద్ తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ రాఘవన్‌నాయక్, అధ్యక్షుడు కృష్ణ చిగుళ్లపల్లి రమేశ్ అభినందించారు.

బాలిక నోట్లో గులికల మందు పోసిన వ్యక్తి అరెస్టు

- నిలోఫర్ ఆస్పత్రిలో బాలికకు చికిత్స
- కొందుర్గు మండలం లాలాపేట్‌లో ఘటన



చికిత్స పొందుతున్న చిన్నారి అర్చన

చౌదరిగూడ జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఓ బాలిక నోట్లో గులికల మందు పోసిన ఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల పరిధిలోని లాలాపేట్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గురువారం కొందుర్గు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లాలాపేట గ్రామానికి చెందిన సద్ది రాజేశ్వరి, మల్లేష్‌ల కూతురు అర్చన (11) అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతోంది. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో కొనసాగుతున్న గుర్రంపల్లి జాతరను పురస్కరించుకొని బుధవారం పాఠశాలకు సెలవు ప్రకటించారు. ఉదయం తల్లిదండ్రులు కూలీ పనుల కోసం వెళ్లిపోయారు. దీంతో అర్చన ఇంటి ముందు ఉన్న మెట్లపై పడుకుని ఉంది. అది గమనించిన అదే గ్రామానికి చెందిన చాకలి రాజు (28) అర్చన దగ్గరకు వచ్చి నోరు తెరిచి పట్టుకుని గులికల మందు పోసి పారిపోయాడు. అర్చన విషయం చెప్పడంతో పిన్ని నాగరాణి, బాబాయి మహేష్ కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొందుర్గు ఎస్ఐ కృష్ణయ్య కేసు నమోదు చేశారు. అనంతరం నిలోఫర్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న అర్చన నుంచి కొందుర్గు పోలీసులు వివరాలు అడిగి తెలుసుకుని స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. గులికల మందు వేసిన వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

పూడూరు డిప్యూటీ తహసీల్దార్ సస్పెండ్

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్



డిప్యూటీ తహసీల్దార్ కిశోర్

పూడూరు, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): భూ రిజిస్ట్రేషన్‌లో అక్రమాలకు పాల్పడిన వికారాబాద్ జిల్లా పూడూరు డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌ను కలెక్టర్ ప్రతీక్‌జైన్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిధిలోని చెన్‌గోముల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్- 496లో 10.22 ఎకరాల భూమి ఉంది. ఇందులో గ్రామానికి చెందిన నూర్జహాన్‌కు ఒక ఎకరా, ఇమ్రాన్ ఖాన్‌కు ఒక ఎకరా, గఫార్‌కు ఎకరా 22 గుంటలు, మల్ల అంజయ్యకు 3 ఎకరాలు, మల్ల బుచ్చమ్మకు 3 ఎకరాలు, మల్ల మల్లేశంకు ఎకరా పొలం ఉన్నది. ఈ భూమిని వాళ్లకు తెలియకుండా హైదరాబాద్‌కు చెందిన మొహ్మద్ అబ్దుల్ బాసిత్ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి నగరానికి చెందిన మాచర్ల గగన్‌రెడ్డి అనే వ్యక్తికి 10.22 ఎకరాలు పట్టా చేశాడు. దీన్ని గుర్తించిన ఆ రైతులు తమ భూమి ఇతరుల పేరు మీదకు మారిందని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. పట్టా మార్పిడి జరిగిన తేదీల్లో తాను సెలవులో ఉన్నట్లు తహసీల్దార్ తెలిపాడు. దీంతో ఆ సమయంలో రైతులు డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌ను నిలదీశారు. దీంతో ఆయన తనకు వారం గడువు ఇవ్వాలని రైతులను కోరారు. అనంతరం రైతుల పేర్ల మీద పట్టా కాదని వారికి వివరించి తమ వారసుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేశాడు. దీన్ని గుర్తించిన గుర్తించిన గగన్‌రెడ్డి.. తన ప్రమేయం లేకుండా తన పేరు మీద ఉన్న పట్టాను మార్చారని చెన్‌గోముల్ పీఎస్‌లో, కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌పై ఫిర్యాదు చేశాడు దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో విషయాలు వెలుగులోకి వచ్చాయి. ధరణిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో డీటీ కిశోర్ అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. దీంతో ఆయనను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.


హామీల అమలులో ప్రభుత్వం విఫలం



గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుపర్చడంతో పూర్తిగా విఫలమైందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు గురువారం చేవెళ్ల మండల పరిధిలోని తల్లారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఏడాది పూర్తవుతున్నా ఒక్కటీ అమలు చేయలేకపోయిందని ధ్వజమెత్తారు. రైతు భరోసా పేరిట ప్రభుత్వం రైతులకు పంగనామాలు పెడుతుందని విమర్శించారు. గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి రావాలని మహాత్ముని విగ్రహాలకు వినతి పత్రాలు అందజేసి నిరసన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని విస్మరించిందని మండిపడ్డారు. పల్లె రోడ్లు అధ్వానంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, నాయకులు రామగౌడ్, ఊరడి రాంప్రసాద్, సుదర్శన్, తోట చంద్ర శేఖర్, ఉపేందర్‌రెడ్డి, ఆసీఫ్, జైపాల్‌రెడ్డి, ఎల్లయ్య, కావలి శేఖర్, మాధవరెడ్డి, నాగుల్‌రెడ్డి, అక్బర్, తదితరులు ఉన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేను మరోమారు అడ్డగింత



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఏసీపీ రంగస్వామి

ఆమన్‌గల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఔటర్ రింగు రోడ్డు నుంచి ఫోర్త్ సిటీ మీదుగా ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేను ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకి బండతండా గిరిజనులు మరోసారి అడ్డుకున్నారు. రోడ్డు సర్వేను ఈనెల 9వ తేదీన ఆమనగల్లు మండలంలో నిర్వహించిన సమయంలో గిరిజన రైతులు అడ్డుకున్నారు. గత రెండు రోజులుగా ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయంలో సాకి బండతండా గిరిజనులతో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు సమావేశం నిర్వహించారు. గిరిజన రైతులు తమ డిమాండ్లను డిప్యూటీ కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. కాగా మున్సిపాలిటీ పరిధిలోని సాకి బండతాండా సమీపంలో గురువారం సర్వే సిబ్బంది మరోసారి సర్వే నిర్వహించేందుకు సిద్ధం కాగా గిరిజనులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేసే వరకు రోడ్డు సర్వేను నిలిపివేయాలని కోరారు. పచ్చటి పంట పొలాల మీదుగా రోడ్డు నిర్మాణం ఎందుకని అధికారులను ప్రశ్నించారు. సమాచారం అందుకున్న కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐ ప్రమోద్ కుమార్ అక్కడికి చేరుకున్నారు. గిరిజన రైతులతో మాట్లాడారు. అయితే తమ భూ సమస్యలు పరిష్కరించి ఎకరాకు రెండు కోట్ల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఫోర్త్‌సిటీలో వందగజాల ఇంటిస్థలం ఇవ్వాలని గిరిజనులు డిమాండ్ చేశారు. సర్వే పనులను అడ్డుకోవడంతో సిబ్బంది వెనుతిరిగారు.



హెచ్ఎం శివకుమార్ దంపతులను సన్మానిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే కాలె యాదయ్య

సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

వికారాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై ఎంతో గురుతర బాధ్యత ఉందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. నవాబ్‌పేట మండలం, ఎకమామిడి జడ్పీ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం శివకుమార్ ఉద్యోగ విరమణ అభినందన సభ గురువారం వికారాబాద్‌లోని బసంత్ ఫంక్షన్ హాలులో జరిగింది. కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మాజీ ఎమ్మెల్సీ కొంపల్లి యాదవరెడ్డి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా శివకుమార్ సేవలు అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ కాగానే నిరాశ పడకుండా సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో మార్పులు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వారు శివకుమార్ దంపతులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్, హెచ్‌డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవోల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సత్తయ్య, పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడియాల చంద్రశేఖర్, దోమ అమర్‌నాథ్, తపస్ నేత అంజిరెడ్డి, ఎంఈవోలు, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

కందులకు మంచి డిమాండ్

- ఐదు రకాల పప్పు దినుసులకు కేంద్ర సహకారం
- నాఫెడ్ ఎండీ సునీల్ కుమార్ షిండే



మార్కెట్‌లో కందులను పరిశీలిస్తున్న షిండే

తాండూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కందులకు మంచి డిమాండ్ ఉందని భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్) ఎండీ సునీల్ కుమార్ షిండే అన్నారు. గురువారం తాండూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కందులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ, కర్నాటకలో కందుల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయని తెలిపారు. 5 రకాల పప్పుదినుసుల పంటల ఉత్పత్తి, కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 36లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడులు వస్తున్నాయని ఆయన వివరించారు. 12లక్షల మెట్రిక్ టన్నుల కంది పంట కేవలం కర్నాటక రాష్ట్రం గుల్బర్గ ప్రాంతంలోనే ఉత్పత్తి అవుతుందని, కర్నాటకలో అత్యధిక కంది దిగుబడి అవుతుందని రైతులకు బోనస్ అందించే దిశగా కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. మార్క్‌ఫెడ్ అధికారి వెంకట్, సూపర్ వైజర్ హబీబ్, డీసీఎంఎస్ మేనేజర్ ఎల్లప్ప పాల్గొన్నారు.

బీటీ రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరు

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

కందుకూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీటీ రోడ్ల మరమ్మతుల నిమిత్తం మంజూరైన నిధుల ప్రొసీడింగ్స్‌ను మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు జీ.ప్రభాకర్‌రెడ్డి, ఎండీ అఫ్జల్‌బేగ్‌లతో కలిసి అందజేశారు. పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పోచమ్మతండా, ఊట్లపల్లి మీదుగా ముచ్చర్ల వరకు సుమారు ఏడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.2కోట్ల72లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. లేమూరు నుంచి తిమ్మాపురం వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డు బీటీ రోడ్డు మరమ్మతులకు రూ.కోటీ 60లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అందుగుల సత్యనారాయణ, గిర్రెంకల యాదయ్య, బాబు, గాదె కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు కళాశాలలు ఇవ్వం

వికారాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం(టీపీజేఎంఏ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని తమ కళాశాలలను పరీక్షా కేంద్రాలకు ఇవ్వడం లేదని ఆ సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు గురువారం ఇంటర్ విద్యా శాఖ నోడల్ అధికారికి స్పష్టం చేశారు. ఈ మేరకు టీపీజేఎంఏ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, జిల్లా ప్రతినిధులు, సీనియర్ కరస్పాండెంట్లు కూర జయదేవ్, డాక్టర్ పి.కృష్ణారెడ్డి, ఎం.బస్వరాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, శివప్రసాద్ వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, నాలుగేళ్లుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక పరిస్థితి బాగో లేదని, ఈ పరిస్థితుల్లో కళాశాలల్లో తాము సీసీ కెమెరాలు తదితర ఏర్పాట్లు చేయలేమంటూ పేర్కొన్నారు. బోర్డు కార్యదర్శి ఏకపక్ష నిర్ణయాలతో ప్రైవేట్ జూనియర్ కళాశాలలన్నీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కళాశాలలకు రెడ్‌కార్పెట్ వేస్తున్న బోర్డు కార్యదర్శి, సంబంధిత ఉన్నతాధికారుల నిర్ణయాలను ప్రభుత్వ పెద్దలు సమీక్షించాలని కోరారు.

గాంధీజీకి ఘన నివాళి



ఆమనగల్లు : గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణ రెడ్డి

- వర్థంతి సందర్భంగా విగ్రహాలు, చిత్రపటాలకు నివాళి
- హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు

ఆమనగల్లు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బాపూజీ అహింసా మార్గం అందరికీ అనుసరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గాంధీ వర్థంతిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూదిని కొండల్‌రెడ్డి, వెంకటేశ్వరావులతో కలిసి గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. పెంటారెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, శంకర్, భీష్మాచారి, దేవయ్య, వెంకటరమణ, సాయిలు, సత్యనారాయణ, అంజన్‌రెడ్డి, తదితరులున్నారు. ఆమనగల్లు పట్టణంలో వర్థంతి నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యువి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నాయకులు రామ్‌రెడ్డి, రమేశ్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఖాదర్, సురేశ్, అలీమ్, పరీద్, ప్రసాద్, విజయ్, శ్రీకాంత్, నాజర్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, చేగూరి వెంకటేశ్, బ్రహ్మచారి, లక్ష్మయ్య, పర్వతాలు, శ్రీను, జహంగీర్ బాబా, మంకి శ్రీను, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ వర్థంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోహన్ రెడ్డి, రవీందర్ యాదవ్, చెన్నకేశవులు, జనార్ధన్‌రెడ్డి, బోల్ల యాదగిరి, నాకం శేఖర్, రాజేందర్, జూలపల్లి శ్రీను, మల్లేశ్, రామస్వామి, గణేశ్, ఆదర్శ్, చెన్నయ్య, తదితరులున్నారు.

శంషాబాద్ : మండల పరిధిలోని నర్కూడలో మహాత్ముడికి నివాళి అర్పించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పాపారావు హాజరయ్యారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీ కుష్టు నిర్మూలనకు ఎనలేని సేవ చేశారని గుర్తుచేశారు. గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

కందుకూరు : మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నేదునూరులో మాజీ వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు ఎండీ అప్జల్‌బేగ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు బి.సురేశ్, నాగరాజు, సోమరాజు వెంకటేష్, ఎ.దర్శన్, జి.సంజీవరెడ్డి, మహేందర్, గుండ్ర సుధాకర్‌రెడ్డి, గాదె కుమార్, మొహినుద్దీన్, అజీజ్, జగదీష్, శ్రీనివాస్‌గౌడ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

యాచారం : గాంధీజీ వర్థంతిని గ్రామాల్లో నాయకులు ఘనంగా నిర్వహించారు. చింతపట్ల, మాల్, యాచారం, తక్కళ్లపల్లి, నందివనపర్తిలో ఆయన విగ్రహానికి రాజకీయ పార్టీల నాయకులు, ఆర్యవైశ్యసంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. రవీందర్‌గుప్త, తడకమల్ల లక్ష్మణ్ తదితరులున్నారు. హైదరాబాద్ గ్రీన్ పార్మాసిటీ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



షాద్‌నగర్ : గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

కేశంపేట : గాంధీ అడుగుజాడల్లో నడుద్దామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వల్లె ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. వేమల్‌నర్వలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మనోహర్ గౌడ్, ఆనంద్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, నర్సింలు, శ్రీరాములు, కృష్ణ, గోపాల్, మాధవులు, నందు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ : గాంధీ ఆశయ సాధన దిశగానే తమ ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గాంధీ వర్థంతిని పురస్కరించుకుని క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారులు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీ వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని ఈ సందర్భంగా కోరారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్

ఇబ్రహీంపట్నం/చౌదరిగూడ/ఆమనగల్లు/శంకర్‌పల్లి/శంషాబాద్/కందుకూరు , జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 420 రోజులైనా వారిచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శలు చేశారు. సంక్షేమ పథకాల పేరుతో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని.. ఇదేం పద్ధతంటూ ప్రశ్నించారు. ఈ గ్రామాల్లో కూడా 20 శాతం కూడా పథకాలు అమలు చేయలేదని ఇలా ఎంతకాలం సాగదీస్తారంటూ ప్రశ్నించారు. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపి వినతిపత్రమందజేశారు. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన గుణపాఠం తప్పదంటూ హెచ్చరించారు. బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, కృపేష్, ఆకుల యాదగిరి, మండలాధ్యక్షులు బుగ్గరాములు, రమేష్, మున్సిపల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ మహేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. చౌదరిగూడ, కొందుర్గు మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. బాబురావు, జబ్బార్, కొండి యాదయ్య, రాంచంద్రయ్య, వెంకటేష్,



ఇబ్రహీంపట్నం : శేరిగూడలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

మాణయ్య, ఇస్మాయిల్ తదితరులున్నారు. కాగా, హామీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ అన్నారు. పట్టణంలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రమందజేశారు. కాంగ్రెస్, సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు ఎంగిలి రఘు, బాలకృష్ణసయ్యద్ ఖలీల్, పంతూనాయక్, శ్రీను నాయక్, రమేశ్ నాయక్, దేరంగుల వెంకటేశ్, సోమ్లానాయక్, గుత్తిబాలస్వామి, ఉమ్లానాయక్, శంకర్ నాయక్, తదితరులున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని శంకర్‌పల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్‌లు నర్సింహరెడ్డి, నర్సింహ, మాణిక్యరెడ్డి, శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ యాదగిరి, ఇంద్రసేనారెడ్డి, లింగం, రాజు, అజీజ్, పాండు, పహీమ్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ప్రభుత్వాన్ని నడపడం చేతకాక సీఎం రేవంత్‌రెడ్డి పూటకోమాట మాట్లాడుతూ బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి ధ్వజమెత్తారు. శంషాబాద్ పాతపట్టణంలోని గాంధీజీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ మోహన్‌రావు అధ్యతన కార్యక్రమం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ సతీష్, రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, దీపామల్లేష్, గౌస్‌పాషా, కొనమొల్ల శ్రీనివాస్, సి. రాజేందర్, హన్మంత్, అశోక్ తదితరులున్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషిచేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డిలు అన్నారు. గాంధీ వర్ధంతిని పురష్కరించుకొని మండల శాఖ అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో కందుకూరు మండలంలోని పలు గ్రామాల్లో గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు అందించారు. మీర్కాన్‌పేటలో నాయకులు కాకి దశరథ, చంద్రశేఖర్, పొట్టి ఆనంద్, కాకి నర్సింహ, దీక్షిత్‌రెడ్డి, బేగంపేటలో మాజీ సర్పంచ్ గోవర్ధన్, సామయ్య, గీతేశ్వరీగణేష్, లింగం, శ్రీనివాస్‌గౌడ్, బండ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



రంగారెడ్డి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం 2025 క్యాలెండర్‌ను గురువారం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఇంట గెలిచి రచ్చ గెలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి

కొత్తూర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ఇంట గెలిచి రచ్చ గెలిస్తే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ, మండల శాఖ అధ్యక్షులు జె.సుదర్శన్‌గౌడ్, గొంగళ్ల హరినాథ్‌రెడ్డిలు హితవు పలికారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఓర్వలేకనే ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీగా గెలుపొందిన తర్వాత షాద్‌నగర్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు ఖర్చు చేశారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీగా గెలుపొందిన తర్వాత పనీపాట లేకుండా తిరుగుతూ అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. ఏళ్ల చరిత్ర కలిగిన మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తుంటే.. కాళ్లల్లో కట్టెలు పెట్టి ప్రకటనలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వైస్ చైర్మన్‌గా ఉన్నప్పుడు ఎంత అభివృద్ధి చేశావో ప్రజలకు తెలుసన్నారు. ఎమ్మెల్యేపై చేస్తున్న ఆరోపణలు మానుకోకుంటే, నియోజకవర్గంలో అడుగు పెట్టనీయమని, ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. దేవేందర్‌ముదిరాజ్, జనార్ధన్‌చారి, సురేందర్, చిలకమర్రి నర్సింహ, శివశంకర్‌గౌడ్‌లు ఉన్నారు.


పేదల శ్రేయస్సుకు సాహసోపేత నిర్ణయాలు

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల శ్రేయస్సు రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో గురువారం ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై అధికారులకు పలు సూచనలు చేశారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.120 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకుడు కొండల్‌రెడ్డిలతో కలిసి అందజేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను రూ.100 కోట్లతో ఆధునీకరించడానికి కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. విపక్షాల విషప్రచారాలు నమ్మి ప్రజలు ఆగంకావొద్దన్నారు. వెంకట్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, శంకర్, నర్సింహ, సాయిలు, వెంకటరమణ, పెంటారెడ్డి, సురేందర్ రెడ్డి, బాబా, తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తే రూ.50 వేల జరిమానా

మద్యపాన నిషేధంపై అయ్యవారిపల్లి గ్రామస్తుల నిర్ణయం



గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

షాద్‌నగర్ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామస్తులు మద్యపాన నిషేధంపై కఠిన నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో మద్యం విక్రయించరాదని మూకుమ్మడిగా నిర్ణయం తీసుకున్నారు. ఇకనుంచి ఎవరైనా మద్యం విక్రయిస్తే రూ. 50వేల జరిమానా విధించాలని నిర్ణయించారు. మద్యం కొన్న వారికి రూ.25 వేల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మద్యం అమ్ముతున్నట్లు సమాచారం ఇచ్చిన వారికి రూ.10 వేలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల్లో మద్యం పంపిణీ చేస్తే సదరు రాజకీయ పార్టీకి రూ.5లక్షల జరిమానా విధించనున్నట్లు తెలిపారు. గ్రామ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వారి నిర్ణయాన్ని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అభినందించారు.

పథకాలను వినియోగించుకోవాలి

షాబాద్/చేవెళ్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలో 34 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.34,03,944 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఏడుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో అపర్ణ, డీటీ మధు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ పనులు వేగవంతం చేయాలి

ఆర్టీసీ బస్టాండ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే యాదయ్య ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న బస్టాండ్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. బస్టాండ్‌ను హెచ్ఎండీఏ నిధులు రూ.6కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ఆగిరెడ్డి, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్, డైరెక్టర్లు పాండుయాదవ్, జనార్దన్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయాన్ని హిమాయత్ నగర్‌లో ఏర్పాటు చేయండి

మొయినాబాద్ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నూతన పురపాలిక పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలో ఇటీవల నూతనంగా గ్రామపంచాయతీ భవనాన్ని ప్రభుత్వం నిర్మించిందని, 8 గ్రామాలను కలిపి ఏర్పాటుచేసిన ఆఫీసును హిమాయత్ నగర్ జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. మున్సిపాలిటీలో కలిసిన 8 గ్రామాలకు హిమాయత్ నగర్ గ్రామం మధ్యలో ఉండడం, నగరానికి అతి చేరువలో ఉండడంతో పాటు అందరికీ అందుబాటులో ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు చొరవతీసుకోవాలని కోరుతున్నారు.

బాలాజీ నగర్ తండా పాఠశాలకు ఉపాధ్యాయుడి నియామకం

కడ్తాల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు లేక మండల పరిధిలోని బాలాజీ నగర్ తండా ప్రాథమిక పాఠశాల నాలుగు రోజులుగా మూతపడింది. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో టీచర్ బదిలీ.. తెరుచుకోని బడి శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డీఈవో సుశీంద్రరావు గురువారం పాఠశాలకు ఉపాధ్యాయుడు రామ్మోహన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నారం పాఠశాలలో విద్యార్థులు లేని కారణంగా అక్కడి ఉపాధ్యాయుడు రామ్మోహన్ ఎక్వాయిపల్లి ఉన్నత పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లి విధులు నిర్వహిస్తున్నారు. డీఈవో ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం సీఆర్పీ పాఠశాలను తెరిచారు. ఏడుగురు విద్యార్థులు హాజరయ్యారు. నూతన టీచర్ శుక్రవారం నుంచి విధుల్లో చేరుతారని ఎంఈవో స్పష్టం చేశారు.

వరాలు కురిపించేనా?

(3వ పేజీ తరువాయి)

పాదయాత్ర కూడా చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రిజర్వాయర్ నిర్మించి షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల సాగు, తాగునీటి కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని సీఎం రేవంత్ నెరవేర్చాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

నేడు మొగిలిగిద్దకు సీఎం రాక

మొగిలిగిద్ద గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4గంటలకు సీఎం రేవంత్ రానున్నారు. అయితే అక్కడ పాఠశాల నూతన భవన నిర్మాణానికి శిలాఫలకాన్ని ప్రారంభిస్తారు. అనంతరం పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు. మొగిలిగిద్ద గ్రామాభివృద్ధి కోసం గ్రామ పెద్దలు రూ.80 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. ఇందులో రూ. 11.50 కోట్లతో పాఠశాల భవనం, రూ. 10 కోట్లతో బాలుర, బాలికల వసతి గృహాలు, 16 కోట్లతో గ్రామ అంతర్గత రోడ్లు, అండర్‌గ్రౌండ్ మురుగునీటి కాలువల నిర్మాణ పనులను చేపట్టబోతున్నారు. వాటిని సీఎం ఆమోదించి నిధులు మంజూరు చేస్తారనే గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలమూరు ప్రాజెక్టు నిర్మాణం కోసం అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.35వేల కోట్లు మంజూరు చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం డిజైన్ మార్పు చేసి 90టీఎంసీల నీరు వచ్చే విధంగా రిజర్వాయర్ నిర్మిస్తామని ప్రకటించింది. కానీ అది కూడా అమలుకు నోచుకోలేదు. ఉమ్మడి పాలమూరు జిల్లా బిడ్డ రేవంత్ అయినా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి భూసేకరణ చేపట్టి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

పెండింగ్‌లో సీఆర్ఆర్ నిధులు

షాద్‌నగర్ నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టేందుకు గాను మంజూరు చేసిన రూ.88 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని విడుదల చేస్తే పలు గ్రామాలకు రవాణా సౌకర్యం మరింత సులభతరం అవుతుంది. నిధులు లేక పలు బ్రిడ్జిలు నిర్మాణ దశలోనే నిలిచిపోగా, మరికొన్ని పనులను ప్రారంభించలేదు. వాటితో పాటు ప్రైమరీ హెల్త్ సెంటర్ల బలోపేతం కోసం రూ. 23 కోట్లు నిధులను మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా కేశంపేట మండల కేంద్రంలో నిధులు లేక నిలిచి పోయిన 30 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం రూ.30లక్షలు అవసరమవుతాయి. అలాగే షాద్‌నగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న 100 పడకల ఆస్పత్రి భవనం నిర్మాణం కోసం మరో రూ.5.30 కోట్లు నిధుల అవసరం ఉంది. ఈ నిధులను సీఎం మంజూరు చేస్తే ప్రభుత్వ ఆస్పత్రులు మెరుగుపడుతాయి. అలాగే పేద విద్యార్థుల కోసం ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. మండల వ్యవస్థ ఏర్పాటుతో పోలీస్ స్టేషన్‌ను ఎత్తివేయడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆతరువాత వసతి గృహాన్ని షాద్‌నగర్‌కు తరలించడంతో ఆ భవనం సైతం శిథిలావస్థకు చేరుకుంది. గ్రామ పరిపాలన కోసం ఇరుకైన గదులతో నిర్మించిన గ్రామ పంచాయతీకి నూతన భవనాన్ని నిర్మించలేదు. సీఎం ఈ అంశంపైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కల



లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం మా కల. దీనిని నిర్మిస్తామన్న కేసీఆర్ మాటలు నీటి మూటలయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి అయినా నిధులు మంజూరు చేసి రిజర్వాయర్ నిర్మించాలి. అలా చేస్తే నియోజకవర్గ గ్రామాలు సస్యశ్యామలం అవుతాయి.

- గోపాల్‌రెడ్డి, రైతు, లక్ష్మీదేవిపల్లి

సాగు నీటి ఇబ్బంది ఉండదు



లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపడితే సాగు నీటి సమస్య తీరుతుంది. సరిపడా నీరు లేక పూర్తి స్థాయిలో పంటల సాగు జరగడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద మనసు చేసుకొని రిజర్వాయర్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

- అలివేలు, రైతు, లక్ష్మీదేవిపల్లి

ఎమ్మెల్సీ అక్రమంగా భూములు లాక్కున్నాడు

- పోలీసులతో బెదిరించి అక్రమ కేసులతో జైలుకు పంపారు : బాధితులు



షాద్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

షాద్‌నగర్ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి భయపెట్టి అక్రమంగా తమ భూములు గుంజుకున్నాడని, అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించాడని నందిగామ మండలం మజీద్ మామిడిపల్లి, మంచన్ పహాడ్, మొదళ్లగూడ గ్రామాలకు చెందిన బాధిత రైతులు గురువారం షాద్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తండెడుపల్లి ఇందిరమ్మ అనే మహిళా రైతు మాట్లాడుతూ తమ భూమిని అక్రమంగా లాక్కొని తమపైనే కేసులు పెట్టి జైలుకు పంపించారని కన్నీరు పెట్టుకున్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ పని చేయకుండా చేసి 144 సెక్షన్ పెట్టించి డీసీఎంలో తమను పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరుగలేదని వాపోయారు. దొంగ డాక్యుమెంట్లు సృష్టించి సంతకాలు ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని తెలిపారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి ఆరాచకాలకు ముగ్గురు రైతులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. ఇప్పటికైనా అతడి అక్రమాలు, బెదిరింపులు, కబ్జాలపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఆందోళన చేసిన వారిలో చీకుర్తి సుదర్శన్, రాజలింగం గౌడ్, తంగేడుపల్లి నర్సింలు, తిమ్మాపురం మాణిక్యం, శేఖర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, లింగం ఉన్నారు.


మూడు నెలలుగా జీతాల్లేక ఇబ్బందులు

కందుకూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నట్లు ఉపాధిహామీ సిబ్బంది వాపోయారు. ఈమేరకు వెంటనే జీతాలు అందజేయాలని కోరుతూ గురువారం సాయంత్రం ఎంపీడీవో సరితకు వినతి పత్రం ఇచ్చారు. ఏపీవో ఎన్ను రవీందర్‌రెడ్డి, ఈసీలు సుగుణ, టీఏ రవికుమార్‌ల ఆధ్వర్యంలో ఉపాధి హామీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యాదయ్య వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడారు. నిత్యావసర వస్తువులు కొనడానికి, బైక్‌లో పెట్రోల్, బస్సు చార్జీలకు పైసల్లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ ఉద్యోగుల సంఘం కార్యదర్శులు బండ వెంకటేష్, అక్షనపల్లి శ్రీనివాస్, యాదయ్య, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా.. 55 మంది ఎంపిక

ఇబ్రహీంపట్నం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 55 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా.ఎస్. రాధిక తెలిపారు. కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగాల కోసం మేళా నిర్వహించినట్లు చెప్పారు. మేళాకు హాజరుకాలేని వారు ధ్రువపత్రాలతో ప్రతినిధులను కలవాలని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డా.సురేష్, కెరియర్ గైడెన్స్ ఆఫీసర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం మండల కమిటీ



నియామకపత్రం ఇస్తున్న నర్సింహారెడ్డి

కొత్తూర్, జనవరి 30(ఆంధ్ర జ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలూకా కమిటీ సలహాదారులు కొళ్లెం నర్సింహారెడ్డి, ఎమ్మె సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోకుల శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్‌చారి, దేశాల భీమయ్య, చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జొల్లు బాలయ్య, కార్యదర్శులుగా ఎమ్మె నర్సింహ, ఎర్ర అర్జున్, ఎండీ ఖయ్యూంఖాన్, కోశాధికారిగా మామిడి దామోదర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులుగా పిన్నంటి రంగారెడ్డి, ఏనుగు మహేందర్‌రెడ్డి, బ్రహ్మచారి, దయ్యాల మల్లేష్, సలహాదారులుగా ఎర్రవెల్లి నవీన్‌చారి, మాధవరెడ్డి, పాండు, రాములగౌడ్‌లతో పాటు, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

'హెవీ' లైసెన్సుల్లేని డ్రైవర్లపై చర్యలు తీసుకోండి

చేవెళ్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): హెవీ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా స్కూల్ బస్సులు నడుపుతున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూసీ జిల్లా నాయకులు అల్లి దేవేందర్, యూనియన్ మండలాధ్యక్షుడు కిష్టయ్య కోరారు. గురువారం యూనియన్ ఆధ్వర్యంలో చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు.

చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌గా పూర్ణచందర్ బాధ్యతల స్వీకరణ



చేవెళ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌గా ఎం.పూర్ణచందర్ గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కొత్తగా ఏర్పడిన చేవెళ్ల పురపాలికకు రెండు రోజుల క్రితం నార్సింగి మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న కృష్ణమోహన్‌రెడ్డి చేవెళ్లకు ఇన్‌చార్జి కమిషనర్‌గా వచ్చి మూడు రోజులు బాధ్యతలు నిర్వర్తించారు. అయితే, ప్రభుత్వం చేవెళ్ల మున్సిపాలిటీకి పూర్తిస్థాయి కమిషనర్‌గా పూర్ణచందర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

శంకర్‌పల్లి కమిషనర్‌గా యోగేష్

శంకర్‌పల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా యోగేష్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతకుముందు నార్సింగి మున్సిపల్ మేనేజర్‌గా పనిచేశారు. యోగేష్ ప్రమోషన్‌పై శంకర్‌పల్లికి వచ్చారు. శంకర్‌పల్లి కమిషనర్ శ్రీనివాస్ జీహెచ్ఎంసీకి వెళ్లారు.

మొయినాబాద్‌కు ఖాజామోహియోద్దీన్

మొయినాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఖాజామోహియోద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహించిన ఖాజామోహియోద్దీన్ ఇక్కడికి పదోన్నతిపై రానున్నారు.

ఆమనగల్లు కమిషనర్ బదిలీ

ఆమనగల్లు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ కమిషనర్ వసంత బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లోని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు.

కార్మికుల సేవలు మరువలేనివి



షాద్‌నగర్ అర్బన్ : దుస్తులు పంపిణీ చేస్తున్న నరేందర్-మహేశ్వరి దంపతులు

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని షాద్‌నగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. గురువారం 200 మంది కార్మికులకు నరేందర్ దంపతులు సొంత డబ్బుతో దుస్తులు పంపిణీ చేశారు. కమిషనర్ వెంకన్న, మాజీ కౌన్సిలర్లు ఈశ్వర్‌రాజు, కానుగు అంతయ్య, ఈగ వెంకట్‌రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే సామాజిక సేవ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు పోటీ పడాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ వసంత అన్నారు. ఆమనగల్లు పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పారిశుధ్య మహిళా కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డితో కలిసి చీరలు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్లు ఎం.చంద్రశేఖర్, జూలూరి రమేశ్, జిల్లా కో-ఆర్డినేటర్ రాంరెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ వీరబొమ్మ రామ్మోహన్, వైస్ చైర్మన్ బాలకృష్ణ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : చీరలు పంపిణీ చేస్తున్న కమిషనర్ వసంత

సంక్షిప్తంగా..

చేవెళ్ల : గాంధీ వర్థంతిని కాంగ్రెస్ నేతలు చేవెళ్లలో నిర్వహించలేదు. గురువారం దేశావ్యాప్తంగా వర్థంతిని ప్రజలు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహిస్తే చేవెళ్లలో మాత్రం నేతలు నిర్వహించక పోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ చేవెళ్లలో నాయకులు అందుబాటులో ఉండి కూడా వర్థంతి నిర్వహించకపోవడంపై నాయకుల పనితీరుపై గుసగుసలాడుతున్నారు.

మొయినాబాద్ రూరల్ : సర్పంచ్ సంతకాలు లేకుండా అవకతవకలకు పాల్పడిన హిమాయత్ నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిపై చర్యలు తీసుకోవాలని చేవెళ్ల డివిజన్ పంచాయతీ అధికారి సతీష్‌రెడ్డికి హిమాయత్ నగర్ మాజీ సర్పంచ్ ముదిగొండ మంజుల రవియాదవ్ పలువురు గ్రామస్థులతో కలిసి ఫిర్యాదు చేశారు. హిమాయత్ నగర్ గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చిన సతీష్‌రెడ్డికి మాజీ సర్పంచ్ ఆమెపై ఫిర్యాదు చేశారు. అభివృద్ధి పనుల కోసం అనేక నిధులు వెచ్చించానని.. ఇందుకు సంబంధించిన బిల్లులు తన సంతకం లేకుండా కార్యదర్శి లబ్ధి పొందారని చెప్పారు. రాత్రివేళ ఇంటి నంబర్లు ఇస్తున్నారని ఆరోపించారు. చాలా వెంచర్లలో ఇంటినంబర్లు అక్రమంగా ఇచ్చారని.. పూర్తి ఆధారాలున్నాయని తెలిపారు.

కేశంపేట : కాకునూర్ శివారు మహాలింగేశ్వర స్వామి ఆలయానికి కొండారెడ్డిపల్లికి చెందిన వీర్లమల్ల సింహయ్యగుప్త జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు సౌండ్‌బాక్స్ వితరణ చేశారు. సింహయ్య గుప్త కుమారుడు రాములు గుప్త, మనుమలు బాలస్వామి, శివకుమార్, అనిల్ పూజారి మహాలింగంనకు సౌండ్‌బాక్స్ ఇచ్చారు.